



అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రామ సుందర్ రెడ్డి

జిల్లాలో యూరియా కొరతపై రైతులు భగ్గుమన్నారు. యూరియా పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలక్ష్యంపై ఎక్కడికక్కడ ఆందోళనలు చేశారు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గజపతినగరం పిఎసిఎస్ వద్ద ఎరువుల కోసం తోపులాట చోటుచేసుకుంది. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రహదారిపై ట్రాక్టర్‌ను అడ్డంగా పెట్టి బైఠాయించారు. డెంకాడ మండలం చొల్లంగిపేటలో ఎరువుల పంపిణీలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.



గజపతినగరం పిఎసిఎస్ వద్ద బారులు తీరిన రైతులు



గజపతినగరంలో యూరియా కోసం రహదారికి అడ్డంగా ట్రాక్టర్ పెట్టి బైఠాయించిన రైతులు

యూరియా కోసం భగ్గుమన్న రైతులు

- గజపతినగరంలో తీవ్ర ఉద్రిక్తత • పిఎసిఎస్‌లోకి దూసుకెళ్లిన అన్నదాతలు
- ఫర్నీచర్, కుర్చీలు ధ్వంసం • రోడ్డుపై బైఠాయించి ట్రాక్టర్‌తో నిరసన



యూరియా కోసం రహదారిపై బైఠాయించిన వృద్ధ మహిళ

ప్రజాశక్తి - గజపతినగరం

గత కొన్ని రోజులుగా యూరియా కొరత కారణంగా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. సరిగ్గా ఇదే సమయంలో గజపతినగరం పిఎసిఎస్‌కు 12టన్నుల యూరియా వచ్చిందనే సమాచారంతో మండల వ్యాప్తంగా వందలాది మంది రైతులు సోమవారం తెల్లవారుజామునే అక్కడికి చేరుకొని బారులు తీరారు. దీంతో పిఎసిఎస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. యూరియా నిల్వల కంటే రైతులు అధిక సంఖ్యలో రావడంతో వారితో మాట్లాడి, అందని వారికి సమీప రైతు సేవా కేంద్రాల్లో రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. దీంతో యూరియా బస్తా కోసం తెల్లవారుజాము నుండి ఎండల్లో నిలుచున్న అన్నదాతలు ఆందోళన చేశారు. కొంతమేర గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండటానికి యూరియా పంపిణీ నిలిపివేయాలని పిఎసిఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, సిబ్బంది నిర్ణయించారు. దీంతో రైతుల్లో ఆవేశం కట్టలు తెంచుకుంది. రాజకీయ నాయకుల సిఫార్సులు కారణంగానే పంపిణీ నిలిపివేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ట్రాక్టర్‌ను రోడ్డుకు అడ్డంగా నిలిపివేసి యూరియా తక్షణమే పంపిణీ చేయాలని నినాదాలు చేశారు. అక్కడే ఉన్న పోలీసులు కొంతమేర రైతులను అదుపు చేశారు. పిఎసిఎస్‌లో ఉన్న కుర్చీలను కొంతమంది రోడ్డుపైకి తీసుకొచ్చి ధ్వంసం చేశారు. ఇదే సమయంలో పిఎసిఎస్‌లోకి రైతులు ఒక్కసారిగా వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో తోపులాట, గొడవలు చోటు చేసుకున్నాయి. సిఐ జి.ఎ.వి.రమణ అక్కడకు చేరుకొని రైతులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. రైతులు ఆందోళన విరమించకపోవడంతో గజపతినగరం ఎడి నిర్మల జ్యోతి అక్కడికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి రెండురోజుల్లో రైతు సేవా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో యూరియా పంపిణీకి ఏర్పాటు చేస్తామని ఎడి హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ఇదే సమయంలో గజపతినగరం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా టోకెన్లు పంపిణీ చేస్తున్నారని ప్రచారం చేయడంతో రైతులు భారీగా అక్కడికి చేరుకున్నారు. దీంతో కొంతమేర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. తక్కువ సంఖ్యలో యూరియా బస్తాలు రావడంతో చాలామంది రైతులు ఎరువులు తీసుకోకుండానే నిరాశతో వెనుదిరిగారు.

ఎరువుల దుకాణం సీజ్

గజపతినగరంలోని శివశక్తి ఆగ్రో కెమికల్స్ దుకాణ యజమాని ఒక్కో యూరియా బస్తా రూ.320కు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో ఎడి నిర్మల జ్యోతి... ఆ దుకాణంలో సోమవారం తనిఖీ చేశారు. యూరియా 222 బస్తాలకు గాను 42 వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. షాపులో ఎరువులను సీజ్ చేశారు. లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు ఎడి తెలిపారు. అనంతరం టోకెన్ ఉన్న వారికి పోలీస్ సిబ్బంది సహకారంతో యూరియా పంపిణీ చేశారు.



అలుగోలు ఆర్‌ఎస్‌కె వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

రైతుల అగచాట్లు

నెల్లిమర్ల : యూరియా కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. వరి పండించే రైతులు ఉదయం లేచిన దగ్గర నుంచి యూరియా ఎలాగైనా సంపాదించాలన్న తప్ప మరొక ధ్యాస కనిపించడం లేదు. ప్రస్తుతం యూరియా ఎంత అవసరం ఉంటుందో తెలియదు గాని దాని కోసం సదరు రైతులు తమ ఆధార్ కార్డులు పట్టుకొని నిద్ర లేచిన దగ్గర నుంచి యాతన పడుతున్నారు. ఒక పక్క ఎరువుల కొరత లేదని చెబుతున్న అధికారు షాప్ దగ్గరకు వచ్చిన రైతులకు మాత్రం యూరియా అందించ లేకపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొలకలు వచ్చే సమయంలో వరి పంటకు యూరియా వేయకపోతే దిగుబడి తగ్గి రైతులు కన్నీరు మిగులు తుందని చెబుతున్నారు. సోమవారం నెల్లిమర్ల మండల కేంద్రం, అలుగోలు గ్రామంలో యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. ఎండ విపరీతంగా ఉండటంతో చాలా మంది ఇబ్బందులు పడ్డారు.

చొల్లంగిపేటలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని చొల్లంగిపేట రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం యూరియా పంపిణీ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎరువుల కోసం చొల్లంగి పేట పరిధిలో ఉన్న రెవిన్యూ గ్రామాల రైతులు ఉదయం నుంచి గంటల తరబడి ఎండలో పడిగాపులు కాశారు. సుమారు 500 మంది రైతులు యూరియా కోసం వేచి ఉండగా కేవలం 120 బస్తాల యూరియా మాత్రమే ఆర్‌బికెకు వచ్చింది.దీంతో రైతులంతా ఒకరినొకరు తోసుకొని కొట్టుకోవడానికి ప్రయత్నించారు. అధికారులపై తిరగబడ్డారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులు తమ ఉన్నతాధికారులకు, పోలీసులకు, రెవిన్యూ అధికారులకు తెలియజేశారు దీంతో ఆర్‌వో దాట్ల కీర్తి, వ్యవసాయశాఖ ఎడి నాగభూషణరావు, తాహశీల్దార్ రాజారావు, ఆర్‌ఐ కిరణ్, విఆర్ఒ తిరుమల రావు, మండలవ్యవసాయ అధికారిని సంగీత అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. అప్పటికీ రైతులు వినకపోవడంతో పోలీస్ బందోబస్తుతో



ఆర్‌ఎస్‌కెలో ఆందోళన చేస్తున్న రైతులు

యూరియాను పంపిణీ చేయాలనే నిర్ణయానికి వచ్చి ఒక ట్రైనీ ఎస్ఐ, మరో ఇద్దరు పోలీసుల సమక్షంలో పంపిణీ చేపట్టారు. పంపిణీ పర్యవేక్షించడానికి వచ్చిన ఆర్‌డిఒ కీర్తి వెంటనే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి మరో 260 బస్తాలు యూరియాను తీసుకువచ్చి రైతులకు పంపిణీ చేయించారు. అయినప్పటికీ రైతుల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుంది. గతంలో ఆర్‌బికె ద్వారా రైతులకు అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచారని, ప్రస్తుతం అరకొర యూరియా సరఫరా వల్ల ఈ గందరగోళ పరిస్థితి వస్తుందని రైతులు వాపోయారు ఒక వన్ బికి ఒక బస్తాయే ఇస్తున్నారని, భూమి ఎక్కువగాఉన్నా ఒక బస్తాయే ఇవ్వడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌కె పరిధిలో రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి సంగీత తెలిపారు. యూరియా దొరకదేమోనని రైతులు ఆందోళన చెంది ఆర్‌బికెల వద్ద ఆందోళన చెందుతున్నారని అన్నారు. వరి సాగు చేసిన ప్రతి రైతుకూ యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. చొల్లంగిపేటలో ఇప్పటివరకు 48 టన్నులు పంపిణీ చేశామన్నారు.



వేపాడలో రైతు సేవా కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

రోజుల తరబడి పడిగాపులు

వేపాడ : వేపాడ రైతు సేవా కేంద్రం వద్ద ఎరువుల కోసం రైతులు సోమవారం గంటల తరబడి పడిగాపులు కాశారు. ఎరువులు పంపిణీ చేస్తారని తెలియడంతో భారీగా రైతులు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో తోపులాట జరిగింది. తహశీల్దార్ రాములమ్మ, పోలీసులు అక్కడికి చేరుకుని, రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ చేశారు.

బొబ్బిలిరూరల్ : మండలంలోని ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో ఎరువులు ప్రభుత్వం సకాలంలో అందివ్వక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రైతు సేవా కేంద్రాలకు యూరియా చేరిందని తెలియడంతో ఆయా రైతు సేవా కేంద్రాలకు ఎరువు కోసం క్యూ కడుతున్నారు. మండలంలోని పారాది, ఎం.బూర్జివలస, జగన్నాథపురంలో ఎరువులు అందజేశారు.



బొబ్బిలి మండలం జగన్నాథపురం రైతు సేవా కేంద్రంలో ఎరువుల కోసం రైతుల అవస్థలు

ప్రజలకు మెరుగైన సేవలందిస్తా

- ఎస్‌పి ఎఆర్ దామోదర్ • పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అందరి సహకారం, సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. నూతన ఎస్‌పిగా నియమితులైన ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం వద్ద పోలీసుల నుంచి ఎస్‌పి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అంశాలకు ప్రాధాన్యత కల్పించి, అందరి సహకారం, సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. జిల్లాలో గంజాయి నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, సైబరు నేరాల నియంత్రణ, రహదారి భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. జిల్లాలో గతంలో 2019 సంవత్సరంలో ఎన్నికల నిర్వహణలో పని చేసిన అనుభవం ఉందని, ఇక్కడ పరిస్థితుల పట్ల సంపూర్ణ అవగాహన ఉందని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలో రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని, వాహనదారులు హెల్మెట్ ధరించే విధంగా చూస్తామన్నారు. అంతకుముందు ఎస్‌పి దామోదర్‌కు అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, లీగల్ అడ్వయిజర్ వై.పరశురాం, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు స్వాగతం పలికి, పుష్ప గుచ్ఛాలను, పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లాలో పని చేస్తున్న పోలీసు అధికారులతో సమావేశ మయ్యారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను వివరించి, నిర్వహించాల్సిన విధుల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఒడిశా రాష్ట్రానికి సరిహద్దుగా జిల్లా ఉండడం వలన గంజాయి అక్రమ రవాణ జరిగేందుకు అవకాశం ఉన్నందున వాటిని పూర్తిగా నియంత్రించాలన్నారు. మహిళలు, బాలల భద్రతకు రక్షణ కల్పించేందుకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. మహిళలు చేస్తున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పించేందుకు ఎంఎస్‌పిలను క్షేత్ర స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. త్వరలో వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులను సమీక్షించి, నేరాల నియంత్రణకు లక్ష్యాలను నిర్దేశిస్తామని తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి పి. సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి. నాగేశ్వరరావు, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు, ఎం.వీరకుమార్, ఆర్.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌పి దామోదర్

స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్..
మహిళల ఆరోగ్య పరిరక్షణకు వరం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకం ఎంతో దోహదం చేస్తుందని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అన్నారు. ఈ పథకానికి సంబంధించి గోడ పత్రికను ఆయన కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. దీని ద్వారా వివిధ రకాల స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించి, అవసరమైనవారికి తగిన వైద్య సదుపాయాన్ని అందించాలని సూచించారు. ఇదే పోస్టర్‌ను పిజిఆర్ఎస్ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలో పథకం గురించి డిఎంహెచ్ఒ జీవనరాణి వివరించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, సీనియర్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో సోమవారం అండర్ 14, 17 విభాగాల్లో బాక్సింగ్ జట్లు ఎంపిక జరిగింది. ఈ ఎంపిక పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. రెండు విభాగాల్లో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీలకు జట్టును ఎంపిక చేసినట్లు స్కూలు గేమ్స్ కార్యదర్శులు గోపాల్, ఎస్.విజయలక్ష్మి తెలిపారు.

పంట నష్టపరిహారం చెల్లించాలని
కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాజాం మండలం గడ్డి ముడిదాం రైతులు నకిలీ విత్తనాలు కొని నష్టపోయినందున వారికి ఎకరాకు రూ.40వేలు పరిహారం చెల్లించాలని, విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్ చేశారు. రైతులతో కలసి సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రైతులు అడిగిన 1001 వరి విత్తనాలకు బదులు ఈ ప్రాంత వాతావరణం పరిస్థితికి, ఖరీఫ్‌కు అనుకూలం కాని రకం గంగోత్రి విత్తనాలు ఇచ్చి శ్రీ నారాయణ డీలర్స్ రైతులను మోసం చేశారని తెలిపారు. విత్తన షాపు యాజమాని పోగిరి ఆదినారాయణ, శ్రీ రామ నారాయణ ఏజెన్సీ, శ్రీ రామ ఆగ్రో జెనిటిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు ద్వారా అడిగితే అవే అని నమ్మించి వేరే రకం గంగోత్రి విత్తనం నాసిరకం ఇచ్చి మోసం చేశారన్నారు కావున ఏజెన్సీ కంపెనీ యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ల ఆదినారాయణ, మండల రైతులు శ్రీనివాసరావు రాము, వెంకట్, గునుపూరువెంకట రమణ, మత్రాపు రామ భగవాన్‌దాసు, గులిపల్లి సుహాన్, గొట్టాపు చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు, రైతులు



అర్జీని పరిశీలిస్తున్న డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి

పిజిఆర్ఎస్‌కు 162 వినతులు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత జిల్లా అధికారులదేనని డిఆర్ఒ ఎస్.శ్రీనివాస మూర్తి స్పష్టం చేశారు. కేసులను పరిష్కరించే ముందు నోటీసులు జారీచేసి విచారించాలని, రికార్డ్ చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులు రీ ఓపెన్ కాకుండా చూడాలని అన్నారు. గడువులోగా వినతులకు పరిష్కారం చూపని యెడల, సంబంధిత అధికారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన పిజిఆర్ఎస్ లో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి ప్రజల నుండి వినతుల స్వీకరించారు. పిజిఆర్ఎస్ కు మొత్తం 162 వినతులు అందాయి. వినతుల స్వీకరణ కార్యక్రమంలో డిఆర్ఒతో పాటు డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, ప్రమీలా గాంధీ పాల్గొన్నారు. అధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 64, డిఆర్‌డిఎకు 47, పంచాయతీ శాఖకు 7, పురపాలక సంఘాలకు 6, ఇతర శాఖలకు సంబంధించి 38 వినతులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆమోదం కొరకు పంపించే ఫైల్స్ ఇక నుంచి ఇ-ఆఫీస్ ద్వారా మాత్రమే పంపించాలని జిల్లా అధికారులను కోరారు.

ఉపాధ్యాయ రణభేరిని జయప్రదం చేయండి

యుటిఎఫ్ సీనియర్ నాయకులు విజయగౌరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి ఈనెల 19వ తేదీ వరకు జరుగనున్న రణభేరి కార్యక్రమాన్ని ఉపాధ్యాయులంతా జయప్రతం చేయాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.విజయగౌరి, జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్ కె ఈశ్వరరావు కోరారు. సోమవారం విజయనగరం, మండలంలోని పలు పాఠశాలల్లో విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి బోధనేతర పనులను అమలు చేయడంలో ఏమీ తేడా లేదన్నారు. పిఆర్‌సి కమిషన్ వేసి, 29శాతం ఐఆర్ ప్రకటించాలని, డిఎలు ఇవ్వాలని, ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని కోరుతూ జరుగుతున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పల్లి రామకృష్ణ, బి.గణేశ్వరరావు, జి.సుశీల, ఎన్.సత్యన్నారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంగర : ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం చొరవ చూపకపోవడం తగదని యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రసాద్, పెంకి గౌరీ శంకర్ అన్నారు. సెప్టెంబరు 15 నుండి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరుగు రణభేరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ నాయకులు సోమవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కె.రమణ, పల్ల మురళి, జేబీ రాజేంద్రప్రసాద్, బాలకృష్ణ, నిరంజన్ పాల్గొన్నారు.



పాఠశాలల్లో ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

ఉపకార వేతనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందేందుకు ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థుల తమ వివరాలను జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ ఇంచార్జ్ ఉప సంచాలకులు డి. వెంకటేశ్వర రావు తెలిపారు. జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ , ఎయిడెడ్ కళాశాలల యజమానులు తమ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్ లభించుటకు ఈ నెలలోపే విద్యార్థుల వివరాలను జ్ఞానభూమి కళాశాల లాగిన్ ద్వారా రిజిస్ట్రేషన్, ఆధార్ ఆథెంటికేషన్ చేయించాలని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో విద్యా సంక్షేమ సహాయకుల లాగిన్ ద్వారా సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

17న ఆటో బంద్

జయప్రదం చేయాలని కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 17న ఆటో, టాటా మేజిక్ కార్మికులు చేపడుతున్న జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఎఐఎఫ్‌టియున్యూ, సిఐటియు, ఎఐటియుసి రవాణా సంఘాల ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.నారాయణరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి షరతులూ లేకుండా లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో,క్యాబ్ ఇతర రవాణారంగా కార్మికులకు వాహన మిత్ర అమలు చేయాలని డిమాండ్ చేశారు..ఉచిత బస్సు పథకం వలన నష్టపోయిన ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్‌లకు రూ.25వేలు ఇవ్వాలన్నారు. జీవో నెంబర్ 21, 31 లను రద్దు చేయాలన్నారు. రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహన్, ఎఐఎఫ్‌టియు న్యూ అధ్యక్షులు అప్పలరాజురెడ్డి, యూనియన్ నాయకులు పాపారావు, ఈశ్వర్ రావు, రామునాయుడు, కుర్మారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆటో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సురేష్ స్కూల్లో తనిఖీలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - గజపతినగరం

మండల కేంద్రం సమీపంలోని కూతవేటు దూరంలో ఉన్న సురేష్ స్కూలులో బొండపల్లి ఎంఇఒలు తనిఖీలు చేపట్టారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దందాపై 'ఫీజుల దందా ఇంకెన్నాళ్లు? అనే శీర్షికన సోమవారం ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంఇఒలు శోభారాణి, అల్లు వెంకటరమణ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా సిబిఎస్ఇ సిలబస్ అమలు, అధిక ఫీజులు వసూళ్లపైఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేపట్టారు. రెండు రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చినట్లు బొండపల్లి ఎంఇఒలు తెలిపారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమకు సేకరించిన భూములను తిరిగి ఇవ్వాలని కోరుతూ నిర్వాసితులు చేపడుతున్న నిరసన సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మాట్లాడుతూ గతంలో పనిచేసిన కలెక్టర్ నిర్వాసితుల వైపు నిలబడకుండా జిందాల్ యాజమాన్యానికి కొమ్ముకాశారని విమర్శించారు. కొత్తగా వచ్చిన కలెక్టర్ అయినా సర్వం కోల్పోయిన జిందాల్ నిర్వాసితుల సమస్యలపై ముఖ్యమంత్రికి ప్రత్యేక నివేదిక సమర్పించాలని కోరారు.

ఉపాధి హామీ నిధుల విడుదల

ప్రజాశక్తి- భోగాపురం

ఉపాధిహామీ కింద వేతనదారులకు నిధులు విడుదలయ్యాయని ఎపిఒ భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో 9,800 కుటుంబాలకు సుమారు రూ.3కోట్లు మంజూరయ్యాయని, ఈ మొత్తాన్ని వేతనదారుల బ్యాంకు ఖాతాల్లో త్వరలోనే జమ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

21న మండల సర్వసభ్య సమావేశం

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఈ నెల 21న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు. మండల స్థాయి అధికారులంతా సమగ్ర సమాచారం, వివరాలతో హాజరు కావాలని సూచించారు.



ఎంపికైన తనిష్క్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

జోనల్ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- రాజాం

బ్యాడ్మింటన్‌లో డివిజనల్ లెవెల్ ఎంపిక పోటీల్లో సత్తా చాటి జోనల్ లెవెల్ పోటీలకు శ్రీ భవిష్య స్కూల్ విద్యార్థి కోడి తనిష్క్ ఎంపికయ్యాడు. పాలకొండ గవర్నమెంట్ హైస్కూల్లో సోమవారం డివిజనల్ లెవెల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీభవిష్య స్కూల్‌కు చెందిన కోడి తనిష్ అండర్-17 బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటాడు. ఇందుకు గాను స్కూల్ కరస్పాండెంట్ కర్రీ కుమారస్వామి, ప్రిన్సిపల్ స్వరూప, ఉపాధ్యాయులు విద్యావతి, రమణ, సత్యం, ఝాన్సీ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు మెంటాడ మండల సమావేశం

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ భానుమూర్తి తెలిపారు. ఈ సమావేశం ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన జరుగుతుందని, ప్రగతి నివేదికలతో అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు. సర్పంచులు, ఎంపిటిసిలు హాజరై, సమావేశంలో సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి రవికుమార్

బానాదిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కొంత కాలంగా ఈ గ్రామానికి పంచాయతీ కార్యదర్శిని నియమించక పోవడం, ఏడాది కాలంగా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించక పోవడంతో పారిశుధ్య పనులు మందకొడిగా సాగాయి. ఇటీవల పంచాయతీ కార్యదర్శిగా మూర్తి బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం కార్యదర్శి ఆధ్వర్యాన పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ పనులను ఇఒపిఆర్‌డి రవికుమార్ పర్యవేక్షించారు.

సాగు భూములకు పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-మెంటాడ


దళిత, గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలని ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కన్వీనర్ టి.సోములు.. ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడుకు సోమవారం వినతి అందించారు. సాగుచేస్తున్న భూములకు పట్టాల్లేక అన్నదాత సుఖీభవ, బ్యాంకు రుణాలు, నష్టపరిహారం, ఇతర రాయితీలు పొందలేక పోతున్నారని తెలిపారు. అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేసి, పేదల సాగు భూములకు పట్టాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.ఎ.నర్సింగరావు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కబడ్డీ అసోసిషన్ ఆధ్వర్యంలో జరిగిన జూనియర్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పూర్తి అయింది. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 26వరకు ఎన్‌టిఆర్ జిల్లా గొల్లపూడిలో జరగబోయే అంతర జిల్లాల కబడ్డీ పోటీలలో పాల్గొన నున్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కారదర్శి కె వి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, ట్రెజర్ శివ, నగేష్ కుమార్ ,కొవ్వాడ శేఖర్ , తౌడుబాబు ,మీసాల శ్రీను , తిరుపతి రావు, సుధ, సౌధమణి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు



పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - చీపురుపల్లి

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కళావెంకటరావు అన్నారు. జాతీయ పశువ్యాధుల నివారణా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన సంబంధిత అధికారులతో కలిసి గోడ పత్రికలను విడుదల చేశారు. ఈపుల15 నుండి అక్టోబర్ 15 వరకు గ్రామాల వారీగా పశువైద్య శిబిరాలను నిర్వహిస్తారని, టీకాలు ఉచితంగా వేస్తారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులతో పాటు పశు వైద్యులు సిహెచ్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్, డెంకాడ

విజయనగరం ఇంజినీర్స్ ఫోరం ఆధ్వర్యంలో సర్ మోక్షగుండం విశ్వేశరయ్య జయంతి సందర్భంగా సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ కార్యాలయాల ఆవరణల్లో ఉన్న మోక్షగుండం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తరువాత పూల్‌బాగ్‌లోని ప్రేమసమాజంలో వృద్ధులకు రోజు వారి అవసరమైన వస్తువులు అందజేయడంతోపాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశపు మందిరం లో సభ నిర్వహించారు. ముఖ్య అతిధులుగా పాల్గొన్న పిఆర్ ఎస్ఇ ఎమ్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత మాట్లాడుతూ నేటి సమాజంలో ఇంజినీరింగ్ వ్యవస్థలో వస్తున్న సవాళ్ళను ఆధిగమించి అభివృద్ధి ఫలాలు అందరికి అందించేలా ప్రయత్నం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇఇలు రమణమూర్తి, రత్నకుమార్, రిటైర్డ్ ఎస్ఇలు శివానందకుమార్, గుప్తా, విజయకుమార్, రిటైర్డ్ డిఇలు ఎంవిఎన్ వెంకటరావు, చీకటి దివాకర్, ఇంజినీర్స్ ఫోరం నాయకులు అప్పలనాయుడు, శారదారాజశేఖర్ తో పాటు పలువురు డిఇలు, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించారు. 'డీప్ టెక్ అండ్ ఇంజినీరింగ్ ఎక్సలెన్స్, డ్రైవింగ్ ఇండియాస్ టెకేడ్' అనే థీమ్‌తో ఈ వేడుకను



ప్రేమసమాజంలో వృద్ధులకు భోజనాలు పెడుతున్న ఇంజినీర్లు

నిర్వహించారు. ప్రభుత్వ జలవనరుల శాఖ విశ్రాంత ఇఇ డాక్టర్ కె.రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. 'సుస్థిర ఇంజినీరింగ్ ఆచరణ' పై ఆయన చేసిన ప్రసంగం విద్యార్థులను ఆకట్టుకుంది కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.రవికిశోర్, ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, తదితరులు ప్రసంగించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు ఆధ్వర్యాన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



లెండీ కళాశాలలో పాకెట్ శాటిలైట్ గురించి వివరిస్తున్న విద్యార్థి గౌతమ్‌కుమార్

ఎంవిజిఆర్‌లో ఇంజనీర్స్ డే వేడుకలు

ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే సందర్భంగా 'ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ అండ్ ఫ్యూచర్ ఆఫ్ టెక్నాలజీ' అనే థీమ్‌తో ఇంటరాక్టివ్ స్పెషల్ గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ ప్రొడక్ట్ మేనేజర్ మనూ కపూర్ ముఖ్య అతిథిగా హాజరై 'ఫ్యూచర్ ఇంజనీరింగ్ ఇన్నోవేషన్‌కు ఉత్ప్రేరకంగా ఎఐ' అనే అంశంపై మాట్లాడారు. ఎంవిజిఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసి శేఖర్ ఇంజనీర్స్ డే యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో శిక్షణ అండ్ ప్లేస్మెంట్స్ డీన్ డాక్టర్ ఎం.సునీల్ ప్రకాష్, శిక్షణ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎంవివి భాను, స్వేచ్ఛ-ఎపి-ఎంవిజిఆర్ కోఆర్డినేటర్ ఎం.వంశీ కృష్ణ,అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

లెండి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో సమాజ అభివృద్ధి సాంకేతిక



ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద మోక్షగుండం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇంజినీర్లు

ప్రగతికి ఇంజినీర్ల చేసిన కృషిని గుర్తిస్తూ వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వివి. రామారెడ్డి మాట్లాడుతూ ఇంజినీర్లు సృజనాత్మకతతో ముందుకు వచ్చి సాంకేతికతను సమాజ అవసరాలతో సమన్వయం చేస్తూ ప్రపంచానికి ఉపయోగపడాలన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మార్రిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ విశాఖపట్నం జనరల్ మేనేజర్ సబాసాచి ముజుమ్దార్ మాట్లాడారు. అనంతరం ఎస్‌కోట మండలానికి చెందిన గనివాడ గౌతమ్ కుమార్ తయారు చేసిన పాకెట్ సాటిలైట్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ కార్యదర్శి కె.శివరామ కృష్ణ, సమన్వయకర్త డాక్టర్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, డాక్టర్ అంజి రెడ్డి, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

భోగాపురం: కవులవాడ గ్రామంలోని అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజికల్ అకాడమీలో ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయనగరం జెఎన్‌టియు విభాగాధిపతి డాక్టర్ వి.ఎస్.వకుల హాజరై డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గోవిందరావు వైస్ ప్రిన్సిపాల్ కె. భాస్కర్ రావు, కళాశాల ప్రతినిధి ముత్తం శెట్టి మహేష్, ఎఒ జి. అశోక్ కుమార్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఏ.వాసుదేవరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గరివిడి: అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బాల భాస్కరరావు అధ్యక్షతన సోమవారం ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫెర్రో ఎల్లాయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎజిఎం, మెకానికల్ ఇంజనీర్ ఆర్‌వికె దుర్గాప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎఒ జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్తు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి పవర్ జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విజయనగరం సర్కిల్‌లోని అన్ని విద్యుత్ సస్టేషన్లు, ఆఫీసుల వద్ద, విద్యుత్తు భవన్ వద్ద సోమవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ల వద్ద ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు సురగాల లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగసంఘాలతో చర్చించి ప్రస్తుత ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా పరస్పర అవగాహనతో ఒప్పందాలు చేయాలని పేర్కొన్నట్లు తెలిపారు. పూర్వం నుండి అమలులో ఉన్న "వెయిటేజ్" ఫార్ములాను రద్దుచేసి, అతి తక్కువ శాతం (8శాతం) ఫిట్మెంట్ బెనిఫిట్‌ను, పాత పద్ధతికి విరుద్ధంగా ఇంక్రిమెంట్లు, మాస్టర్



విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

స్కేలు రూపొందించారన్నారు. ఈ పద్ధతి వల్ల ఉద్యోగులు చాలా నష్టపోయారని, పై సమస్యలన్నిటిపైన యాజమాన్యాలతో పలు ధపాలుగా చర్చించినప్పటికీ ఫలితం లేనందున కార్యాచరణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

జగన్ బ్యాచ్‌తో అప్రమత్తం

ఎమ్మెల్యే కళా వెంకటరావు

ప్రజాశక్తి - చీపురుపల్లి

జగన్‌మోహన్‌రెడ్డి అండ్ కంపెనీ బ్యాచ్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ప్రజలను హెచ్చరించారు. తన క్యాంపు కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్థానిక నాయకులతో కలసి సోమవారం మాట్లాడారు. జగన్‌కు వంత పాడుతున్న బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, పేర్ని నాని వంటి వారు ఇప్పటికే రాష్ట్రాన్ని విధ్వం చేశారన్నారు. అటు కాంగ్రెస్‌లో పదేళ్ళ, వైసిపిలో ఐదు సంవత్సరాల పాటు మంత్రిగా ఉన్నప్పుడు స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణ బొత్స సత్యనారాయణకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంటు ఆంధ్రుల హక్కు అని ఇప్పుడు గుర్తొచ్చిందా అని అడిగారు. 11 సీట్లు ఇచ్చి ప్రజలు పక్కన కూర్చో పెడితే తనకు ప్రతిపక్షనాయకుడి హోదా కావాలని జగన్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ముందుకు వెళుతున్న ప్రభుత్వాన్ని టెండర్లు వేయొద్దనడంతో పాటు తాము అధికారంలోకి వస్తే కట్టిన వాటిని కూల్చేస్తామని జగన్ అండ్ కో బ్యాచ్ కాంట్రాక్టర్లను బెదిరింపులకు పాల్పడడం విధ్వంశకర చర్యే అవుతుందని అన్నారు. జగన్‌కి అధికార దాహం తీరలేదని, ఎంత వేగం అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని దోచేయాలనే ఆలోచనే తప్ప వేరే ఆలోచనే జగన్‌కి లేదని అన్నారు. టిడిపి నాయకులు రౌతు కాము నాయుడు, పైలబలరాం, గవిడి నాగరాజు, రెడ్డి గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో నిర్వాసిత కుటుంబాలకు పని కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గిరిజన యూనివర్శిటీ నిర్మాణంలో తమకు పని కల్పించాలని కోరుతూ రామభద్రపురం మండలం పాతరేగ గ్రామానికి చెందిన నిర్వాసిత కుటుంబాలు సోమవారం కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీకి భూములు తీసుకున్న సందర్భంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, నిర్మాణ పనులు జరిగినప్పుడు ఉపాధి కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. కానీ హామీ నెరవేర్చకుండా ఇతర రాష్ట్రాల నుంచి వర్కర్స్ తీసుకువచ్చి పని చేయించుకుంటున్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. నిర్వాసితులకు పని కల్పించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుంటినవలస గ్రామ సర్పంచ్ రమేష్, పాత రేగకు చెందిన శంకర్రావు, చిన్నారి, నాగమణి, టి.భాస్కరరావు, ఎ.పార్వతి, జి.భాగ్యలక్ష్మి చిప్పాడ వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి- రేగిడి

మహిళలు, కిషోర్ బాలికల పట్ల ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి అని వైద్యాధికారి డాక్టర్ అసిరి నాయుడు అన్నారు. రేగిడి ఆరోగ్య కేంద్రంలో స్వస్తినారి సశక్తి పరివార్ అభియాన్‌పై వైద్య సిబ్బందితో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. అసంక్రమిత వ్యాధుల కోసం మహిళకు స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి అన్నారు. కిషోర్ బాలికలకు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ టెస్ట్ తప్పనిసరి చేయాలన్నారు. క్షయవ్యాధి గుర్తించాలని స్వస్తినారి స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామాల్లో ఇంటింటి కార్యక్రమం చేపట్టాలన్నారు. వీరితోపాటు సిహెచ్, హెల్త్ సూపర్వైజర్ అప్పారావు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆటో బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల 17న చేపట్టే ఆటో బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పి.శంకరరావు కోరారు. సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్దనున్న ఆటో స్టాండ్‌లో ఆటో యూనియన్ నాయకులు బిటిఆర్ ఆధ్వర్యాన బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 17న ఉదయం తొమ్మిది గంటలకు బొబ్బిలిలో ఉన్న ఆటో కార్మికులంతా ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద జరిగే నిరసనలో పాల్గొవాలని కోరారు. మోహన్, ఎస్.గోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : ఆటో బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ దత్తిరాజేరు మండలం కోమటిపల్లి ఆటో స్టాండ్ వద్ద సిఐటియు, ఎఐఎఫ్‌టియు (న్యూ), ఎఐటియుసి ఆధ్వర్యాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆరోజు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు బందు చేసి విజయనగరంలో జరిగే ర్యాలీ లో కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, ఆటో యూనియన్ అధ్యక్షులు బి అప్పలనాయుడు ఎం గౌరి నాయుడు, పి.రాము , ఎస్.గణేష్ బి చంటి ,బలరాం తదితరులు పాల్గొన్నారు .

ఆదర్శ పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఎపి ఆదర్శ పాఠశాలలో హిందీ దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపల్ ఈశ్వరరావు బహుమతులు అందజేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓటర్ల జాబితా అవకతవకలపై ఉద్యమం

ప్రజాశక్తి-విజయనగరంకోట

దేశంలో బిజెపి ప్రభుత్వం ఓటర్ల జాబితాలో పాల్పడుతున్న అవకతవకలపై ఉద్యమం చేపడతామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ అన్నారు. ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓట్ల చోరీపై ఆందోళన పోస్టర్‌ను కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌరుల ఓట్లను కొల్లగొట్టి అధికారంలోకి వచ్చి ప్రజల ఓట్లను లేకుండా చేస్తుందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా ఎఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ చేపడుతున్న ఓట్ చోరీ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టామన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టేటప్పుడు ఖచ్చితమైన ఆధారాలతో నిర్వహించాలన్నారు స్పష్టమైన ఓట్ల జాబితాను విడుదల చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట నియోజకవర్గ కన్వీనర్ గేదెల తిరుపతిరావు, ఉపాధ్యక్షులు షరీఫ్, సమన్వయకర్త శ్రీనివాసరావు, చంద్రశేఖర్ నియోజకవర్గాల కన్వీనర్లు పాల్గొన్నారు.

అంగీకార్ విధానంపై చైతన్యం కావాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం అమలులో భాగంగా అంగీకార్ అనే కేంద్ర ప్రభుత్వ విధానం పట్ల ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, గృహ నిర్మాణ సంస్థ పీడీ జి.మురళీమోహన్ అన్నారు. సోమవారం కమిషనర్ ఛాంబర్ లో అంగీకార్ 2025 తో పాటు, ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాల వివరాలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అందరికీ సొంత ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం ద్వారా 2.0 ప్రకారం ఇక నుండి రూ.2.50లక్షలను సబ్సిడీగా అందించనున్నదని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో 2.0 పథకం అమలు కింద 700 మంది గృహ లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. గృహ నిర్మాణ సంస్థ పీడీ మురళీమోహన్ మాట్లాడుతూ సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ పథకాన్ని వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో డిఇ జివి రంగారావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ పల్లి నల్లనయ్య వినతులు స్వీకరించారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు తెలిపారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లి, పట్టణంలో దేవాంగులవీధిలో సోమవారం అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గొల్లపల్లి దమ్మోవీధిలో రూ.10.50 లక్షలతో సిసి రోడ్డు, తొమ్మిదో వార్డు దేవాంగులవీధిలో రూ.4.17 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సావు శారద, బొత్స రమణమ్మ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు

పత్ర ద్రావణంతో చీడపీడల నివారణ

ప్రజాశక్తి-గంట్యాడ

పత్ర ద్రావణంతో చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం వసాది యూనిట్ ఇన్‌ఛార్జి కొప్పాక లక్ష్మి తెలిపారు. బోనంగి గ్రామంలో వరిచేనులో పలుపత్ర ద్రావణాన్ని డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి సునీత, తదితరులు పాల్గొన్నారు.

చెరువు గండిని పూడ్చిన రైతులు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక మున్సిపాలిటీలోని మల్లమ్మపేట సమీపంలో ఉన్న మల్లమ్మ చెరువు గట్టుకు పడిన గండిని రైతులు పూడ్చారు. చెరువుకు గండి పడడంతో సాగునీరు వృథాగా పోయింది. దీంతో స్పందించిన రైతులు ఇసుక బస్తాలతో చెరువు గండిని పూడ్చారు. చెరువు గట్టును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను రైతులు కోరుతున్నారు.

ఉద్దేశ పూర్వకంగానే దాడి : పిఎసిఎస్ చైర్మన్

ప్రజాశక్తి-గజపతినగరం

పిఎసిఎస్‌పై కొంతమంది ఉద్దేశ పూర్వకంగానే దాడి చేశారని ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, పిఎసిఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు ఆరోపించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల వ్యాప్తంగా యూరియా నిల్వలు రైతులకు సరిపడా ఉన్నాయని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే ఒకటి రెండు గ్రామాల నుంచి ప్రతిపక్ష నాయకులు కొంతమంది తమ రైతులను తీసుకొచ్చి దాడి చేయించారని తెలిపారు. కొంతమంది రైతుల ముసుగులో కావాలనే కార్యాలయంలోని ఫర్నిచర్, కుర్చీలు, కిటికీలు ధ్వంసం చేసేందుకు ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎంపిపి, జెడ్‌పిటిసి సైతం సమస్య ఉన్న చోట రైతులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సోమవారం జరిగిన యూరియా పంపిణీలో అధికారుల సమన్వయ లోపం కొంత ఉందని, మరొకసారి ఇటువంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

సహోద్యోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సహ ఉద్యోగుల కష్టాలలో పాలుపంచుకోవడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో డిపిఒగా సేవలందిస్తున్న వెంకట్రావు కుటుంబ ఆరోగ్య పరిస్థితి దయనీయంగా ఉన్నదని గ్రహించిన సహోద్యోగులు ఆయనను ఆదుకునేందుకు లక్షా 25వేల రూపాయలను అందజేశారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు ముందుకు వచ్చి వెంకట్రావు పరిస్థితిని వివరిస్తూ నిధుల సేకరణకు నడుం బిగించారు. దీంతో సమకూరిన నగదును కమిషనర్ ఛాంబర్ లో వెంకటరావుకు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నరసింగరాజు, మూర్తి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి- డెంకాడ

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని అక్కివరం గ్రామంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, స్థానిక ఎంపిటిసి కంది చంద్రశేఖర్, సర్పంచ్ కంది కిరణ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 225 పాడి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం వెదుళ్లవలస, రఘుమండ, పినతాడివాడ గ్రామాల్లో సుమారు 700 పశువులకు టీకాలు వేశారు.

గ్రామ సమస్యలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ప్రతి ప్రజాప్రతినిధి ప్రజా సమస్యలపై అవగాన కలిగి ఉండాలని బాడంగి ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బొబ్బిలి, బాడంగి మండలాల సర్పంచులు, ఎంపిటిసిలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి పన్నుల వసూళ్లలో అధికారులతో సహకరించాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పంచాయతీ నిధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎ.భాస్కరరావు, రిసోర్స్ పర్సన్లు మురళి, శ్రీనివాసరావు పాల్గొన్నారు

కష్ట సుఖాల్లో వైసిపి తోడు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ప్రజల కష్ట సుఖాల్లో నిరంతరం వైసిపి తోడుంటుందని ఆ పార్టీ జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. సోమవారం చీపురుపల్లిలోని పలు వార్డులలో స్థానిక వైసిపి యువతతో కలసి పర్యటించారు పజల కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం వైసిపి పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మంగళగిరి శ్రీనివాసరావు, కర్రోతు రమణ, కొసిరెడ్డి రమణ, రౌతు పైడిరాజు, గవిడి సురేష్, కోరుకొండ దాలయ్య, కర్రోతు ప్రసాద్, మజ్జి శంకర్ బూరాడ మహేష్, తలచుట్ల రాము, పతివాడ అఖిల్ పాల్గొన్నారు.

రేగానకు బడ్డుకొండ పరామర్శ

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని సీతారామునిపేట గ్రామానికి చెందిన వైసిపి నాయకులు రేగాన శ్రీనివాసరావు తన అన్న కుమారుడు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు రేగాన కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి వైసిపి తరుపున అండగా ఉంటామని చెప్పారు. ఆయన వెంట జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, నాయకులు కొట్ల పైడినాయుడు తదితరులు ఉన్నారు.

హామీల అమలుకు ఆటో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫ్రీ బస్సుతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు నెలకు రూ.5వేలు పించను ఇవ్వాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యాన ఆటో కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పైడిమాంబ ఆటో కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు పి.శంకర్రావు అధ్యక్షులు ఎస్. కనకారావు, కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడారు. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సబ్సిడీ ధరలపై పెట్రోల్ డీజిల్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

రైతు సేవా కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- బొబ్బిలిరూరల్

మండలంలోని పారాది, ఎం.బూర్జివలస, కృష్ణాపురం రైతు సేవా కేంద్రాలను సోమవారం ఆర్‌డిఒ రామ్మోహన్‌రావు, తహశీల్దార్ శ్రీను తనిఖీ చేశారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని ఆర్‌డిఒ తెలిపారు. అవసరమైనన్ని ఎరువులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.